
ప్రజాశక్తి
ఆదివారం 18 ఫిబ్రవరి 2024 5 పార్వతీపురం మన్యం



'ఎన్నికల సంస్కరణలు-డబ్బు పాత్ర'పై నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రజాస్వామ్యానికి విఘాతం తెచ్చిన ఎన్నికల బాండ్లపై సుప్రీం కోర్టు తీర్పు, ఎన్నికల సంస్కరణలు, దొంగ డబ్బు పాత్ర అంశంపై వివిధ రాజకీయ పార్టీల వైఖరిపై ఈనెల 18న స్థానిక సుందరయ్య భవనంలో ఉదయం 10గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని సిఐటియు జిల్లా నాయకులు రెడ్డి వేణు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజాసంఘాలు, ప్రజాతంత్రవాదులు, లౌకికవాదులంతా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు బంటు దాసు, శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు వి.ఇందిర పాల్గొన్నారు.



సాలూరులో ర్యాలీ చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగులు

జెఎసి ఆధ్వర్యాన ఉద్యోగుల ర్యాలీ

ప్రజాశక్తి - సాలూరు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి జెఎసి ఆధ్వర్యాన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు శనివారం ర్యాలీ చేపట్టారు. జెఎసి తాలూకా యూనిట్ చైర్మన్ ఎ.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యాన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు పట్టణంలోని శ్రీరామా థియేటర్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ధర్నా శిబిరాన్ని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బాలబోలు ధనుంజయరావు ప్రారంభించారు. అనంతరం స్టేట్ బ్యాంక్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి చైర్మన్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తే చాలనే పరిస్థితికి ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఉద్యోగులు దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ డబ్బులు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. 30శాతం ఐఆర్ చెల్లించాలని కోరారు. పిఆర్సీ వెంటనే ప్రకటించాలని, ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు జిఒ 117ను రద్దు చేయాలని కోరారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు ఎంవి గౌరీశంకర్, బాలి పద్మలత, సింగారపు సింహాచలం పాల్గొన్నారు.

పాలకొండ : ఎపిజెఎసి పిలుపు మేరకు పాలకొండ డివిజన్ జెఎసి ఆధ్వర్యంలో ఎన్‌జిఒలు స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ దగ్గర మానవహారం చేపట్టారు. అంతకుముందు తహశీల్దార్ కార్యాలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌జిఒ గౌరవాధ్యక్షులు లిల్లీ పుష్పనాథం మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, డిఎ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ వరహాలు, డివిజన్ కార్యదర్శి పైల ఈశ్వరరావు ఎస్టీవో గౌరీశ్వరరావు, ఎన్జీవో నాయకులు అనూషబాబు తదితరులు పాల్గొన్నారు.



బదిలీ అయిన జెసి గోవిందరావును సన్మానిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ కేశవనాయుడు

నిబద్ధత కలిగిన అధికారి గోవిందరావు

ప్రజాశక్తి - పార్వతీపురం

జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు నిబద్ధత, కష్టపడేతత్వం గల అధికారి అని, అప్పగించిన పనిని సకాలంలో పూర్తిచేసే వారని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. జిల్లా నుంచి బదిలీపై వెళ్తున్న జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావును శనివారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ జాయింటు కలెక్టరుగా గోవిందరావు పనిచేసిన కొద్దికాలంలోనే తనదైన ముద్రవేసుకొన్నారన్నారు. ధాన్యం సేకరణ, రీసర్వే వంటి పనులను సమర్ధవంతంగా పూర్తిచేశారని తెలిపారు. అనంతరం బదిలీపై వెళ్తున్న జెసి గోవిందరావు మాట్లాడుతూ జిల్లాలో పనిచేసిన కాలంలో విధులు సమర్ధవంతంగా నిర్వర్తించడంలో మార్గనిర్దేశం చేసిన కలెక్టరు నిశాంత్ కుమార్‌కు, సహకరించిన అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. తాను గతంలో పార్వతీపురం ఆర్‌డిఒగా పనిచేశానని, జెసిగా ఉద్యోగోన్నతి పొంది గతంలో పనిచేసిన జిల్లాకు రావడం ఎంతో సంతోషం కలిగించిందని తెలిపారు. జిల్లాలో ధాన్యం సేకరణ, రీసర్వే, జగనన్నసురక్ష, ప్రజాపంపిణీ వ్యవస్థ, ఆడుదాం ఆంధ్ర, ఇ-క్రాప్ బుకింగు, కులగణన వంటి అంశాల్లో రాష్ట్ర స్థాయి సూచీల్లో తొలి అయిదు స్థానాల్లో జిల్లా ఉండడం తనకు చాలా సంతోషం, సంతృప్తి కలిగించిందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ జి.కేశవ నాయుడు, పార్వతీపురం, పాలకొండ ఆర్‌డిఒలు కె.హేమలత, వి.వి.రమణ, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎంవిఆర్ కృష్ణాజీ, డిపిఒ బి.సత్యనారాయణ, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డిఇఒ పగడాలమ్మ, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, జిల్లా ప్రజా రవాణా అధికారి టి.వి.ఎస్.సుధాకర్, డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వర రావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా ఖజానా అధికారి ఎ.మన్మథరావు, జిల్లా కలెక్టర్ కార్యాలయ విభాగ అధిపతులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి

విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - మక్కువ



సీదరపు అశోక్ (ఫైల్)

మండలంలోని ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సీదరపు అశోక్ (15) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం స్థానిక ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ పుష్పనాదం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అశోక్ గురువారం రాత్రి నుంచి స్వల్ప అస్వస్థతకు గురయ్యాడు. దీంతో శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శుక్రవారం చికిత్స నిమిత్తం తరలించామని తెలిపారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఎనిమియాగా ఉండడంతో ఇంజక్షన్‌తో కూడిన బాటిల్ అశోక్ కిచ్చి హాస్టల్‌కు పంపించినట్లు తెలిపారు. శుక్రవారం రాత్రి సుమారు 9.30 గంటల ప్రాంతంలో శ్వాస సంబంధిత బాధతో ఇబ్బంది పడుతుండడంతో హాస్టల్ వార్డెన్ చంద్రావు 108 సాయంతో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఆయన తెలిపారు. విద్యార్థి అశోక్ మృతదేహాన్ని శనివారం స్వస్థలమైన పాచిపెంట మండలం కారాడవలసకు తరలించినట్లు ఆయన తెలిపారు. అశోక్ క్లాసులో తెలివైన వాడితో పాటు మంచి సత్ప్రవర్తన కలిగి ఉండేవాడని ఈ సందర్భంగా ప్రిన్సిపల్ తెలిపారు. అందరితో కలిసి ఆటపాటలతో పాల్గొని రాత్రి పడుకునే సమయంలో అనారోగ్యానికి గురై అశోక్ తమ మధ్య లేకపోవడంతో తోటి విద్యార్థులు కన్నీళ్ల పర్యంతమయ్యారు. ఇదిలా ఉండగా సాలూరు మండలంలోని కరడవలసకు చేరుకోవడంతో తల్లిదండ్రులు సోమయ్య, రామమ్మలను ఓదార్చడం ఎవరి తరం కాకుంది.

అనారోగ్యంతో మరో ఇద్దరు విద్యార్థులు

ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలలో ప్రస్తుతం మరో ఇద్దరు విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. యు.సంజయ్, జి.సంతోష్ కుమార్ ప్రస్తుతం జ్వరంతో బాధపడుతుండగా వారికి అన్ని విధాలా ఆరోగ్య సేవలందించడం జరిగిందని వార్డెన్ చంద్రావు తెలిపారు. ప్రస్తుతం హాస్టల్లో 260 మంది విద్యార్థులు ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

సీదరపు అశోక్ అనారోగ్యంతో మరణించడం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పండు, సాలూరు మండల కార్యదర్శి టి.అఖిల్, వరుణ్, సునీల్ డిమాండ్ చేశారు. విద్యార్థి మృతిపై వారు శనివారం విచారణ పాఠశాలలో విచారణ చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ అశోక్‌కు సరైన వైద్యమందకపోవడమే ప్రధాన కారణమన్నారు. ఈనెల 16న యాజమాన్యం శంబర పిహెచ్‌కి తీసుకెళ్లి ఆరోగ్య తనిఖీలు నిర్వహించగా, హిమోగ్లోబిన్ శాతం 7శాతం ఉందని తెలియజేశారని, అనంతరం అశోక్‌ను పార్వతీపురం జిల్లా హాస్పిటల్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు తెలిపారు. విద్యార్థి రెండు రోజుల నుంచి ఆరోగ్యం బాగులేనందున విద్యార్థి ప్రధాన మృతి కారణమని, అలాగే పాఠశాలలో మెడికల్ చెక్ అప్ నిర్వహించకపోవడమేనని అన్నారు. పోషకాహారం అందకపోవడం విద్యార్థి మృతి ప్రధాన కారణమన్నారు. ఇప్పటికే విద్యా సంస్థ ప్రారంభం నుంచి ఇప్పుడు వరకు ముగ్గురు విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేపట్టి విద్యార్థుల మృతికి కారణమైన వారిని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మహిళలతో కరచాలనం చేస్తున్న నారా లోకేష్ ; అభివాదం చేస్తున్న టిడిపి, జనసేన నేతలు

శంఖారావం సభలో నారా లోకేష్

వైసిపి పాలనలో..

ప్రజాధనం దోపిడీ

ప్రజాశక్తి - లక్కవరపుకోట, వేపాడ

వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పార్టీ నాయకులు ప్రభుత్వ భూములు, చెరువులు ఆక్రమించుకొని వేల కోట్లు ప్రజధనాన్ని దోపిడీ చేశారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆరోపించారు. శనివారం ఎస్.కోట నియోజకవర్గం సోంపురం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన శంఖారావం సభలో ఆయన ప్రసంగించారు. ఇసుక దందా, గంజాయి , నాసిరక మద్యం వ్యాపారాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఎద్దేవా చేశారు. ఎస్.కోట ఎమ్మెల్యే 25 ఎకరాల భూమిని ఆక్రమించుకొని ఇల్లు నిర్మించుకున్నారని ఆరోపించారు. పెందుర్తి నుండి ఎస్.కోట మీదుగా అరకు వెళ్లే ప్రధాన రహదారి ఆరు లైన్ల పనులు గాలికి వదిలేసారన్నారు. నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాలను కొల్లగొడుతున్నారని అన్నారు. ఈ జిల్లాను అభివృద్ధి చేసింది టిడిపియేనని జిల్లాలో రోడ్లు, తాగు, సాగునీటి ప్రాజెక్టులు, నిరుపేదలకు సొంత ఇళ్లు కట్టింది తమ పార్టీయేనని తెలిపారు. ఎస్.కోటలో రూ.2వేల కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. పెందుర్తి-అరకు రోడ్డును 6 లైన్ల రోడ్డుగా చేస్తానని చెప్పిన జగన్ ఆ తరువాత పట్టించుకోలేదన్నారు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని డబ్బులిచ్చి తెరిపిస్తానని చెప్పాడని, కానీ మనం ఇచ్చిన రూ.13 కోట్లు లాగేసుకుని షుగర్ ఫ్యాక్టరీని చంపేశాడని అన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ - 6 హామీలను ప్రజలకు తెలియజేసే విధంగా ప్రచారం చేస్తామని కార్యకర్తలతో ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నియోజకవర్గంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబర్చిన 50 మందికి లోకేష్ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందజేశారు.

సభకు అధ్యక్షత వహించిన మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక రాక్షసుడు పాలిస్తున్నాడని, ఒక్క అవకాశం పేరుతో అందరూ మోసపోయారని అన్నారు. ఈ అరాచక ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పి, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఐదేళ్లుగా రాష్ట్రంతోపాటు ఎస్.కోట నియోజకవర్గం అభివృద్ధిలో కుంటుపడిందన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే ఇష్టారాజ్యంగా దోపిడీకి పాల్పడుతున్నారని, రెండు చెరువులను కబ్జా చేశారని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక ఎస్.కోటను విశాఖజిల్లాలో చేర్చాలని కోరారు.

జనసేన సమన్వయకర్త సత్యనారాయణ మాట్లాడుతూ విధ్వంసక పాలనలో దెబ్బతిన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు జనసేన-టిడిపి ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం ఇరుపార్టీల కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. సభలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ, గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు , పార్టీ కార్యనిర్వహణ కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరాంప్రసాద్, జనసేన ఎస్.కోట సమన్వయకర్త ఒబ్బిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన తాండాలకు రోడ్డుసౌకర్యం కల్పిస్తాం

తమ గ్రామాలకు రోడ్డు కనెక్టివిటీ లేకపోవడంతో అనారోగ్య సంభవించినపుడు ప్రజల ప్రాణాలు గాలిలో దీపంలా మారాయని మూలబొడ్డవరం, చిట్టంపాడు గ్రామస్తులు లోకేష్ వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. రోడ్డు మంజూరు చేస్తామని వైసిపి ప్రభుత్వం పలుమార్లు ప్రకటించినా ఎటువంటి చొరవా చూపలేదన్నారు. తమ గ్రామాలకు రోడ్డు కనెక్టివిటీ లేకపోవడంతో కొండపైకి వాహనాలు వెళ్లలేవని చెబుతూ ఇటీవల సంభవించిన ఘటనను వివరించారు. దీంతో లోకేష్ స్పందిస్తూ అధికారంలోకి రాగానే గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పిస్తామని, అత్యవసర సేవలకోసం ఫీడర్ అంబులెన్స్ లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

యువనేతకు వినతుల వెల్లువ

నియోజకవర్గంలో వివిధ వర్గాల ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. శంఖారావం సభకు ముందు వారు వినతిపత్రాలు సమర్పించారు. ఆదరణ పథకం కింద సైకిల్ తో పాటు రూ.10వేలు ఆర్థిక సాయం అందించాలని ఏపీ కల్లుగీత కార్మిక సంఘం ప్రతినిధులు కోరారు. బ్యాంకు లింకేజీ లేకుండా 90శాతం సబ్సీడీతో రుణాలు మంజూరు చేయాలని, తెలంగాణలో మాదిరిగా నీరాకేఫ్‌లు ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. కమ్యూనిటీ భవనాల నిర్మాణంతో పాటు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నూతన వసతి గృహాలు నిర్మించాలని నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ నాయకులు కోరారు. కొత్తవలసలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జామిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం ప్రతినిధులు కోరారు. జీవో 104 ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు.



సభకు హాజరైన కార్యకర్తలు

అందరికీ సికిల్ సెల్ ఎనిమీయా పరీక్షలు : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన గ్రామాల్లో చేపడుతున్న సికిల్ సెల్ ఎనిమీయా పరీక్షలు 0 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉన్న ప్రతి ఒక్కరికీ చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. శనివారం స్థానిక ఐటిడిఎ పరిధిలోని అన్ని మండలాల ఎంపిడిఒలు, పిహెచ్‌సి వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకొని అన్ని గ్రామాల్లో పరీక్షలు చేయాలన్నారు. ఇంకా గ్రామాల్లో, పాఠశాలల్లో పరీక్షలు చేసుకోనివారంటే వారిని గుర్తించి టెస్టులు చేయాలని అన్నారు. పరీక్షల నివేదికలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతిరోజు చేసిన పరీక్షల రిపోర్టులను ఐటిడిఎ కార్యాలయానికి అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల డిఎంహెచ్‌ఒలు మీనాక్షి, జగన్నాథరావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ విజయ పార్వతి, స్థానిక ఎంపిడిఒ గీతాంజలితో పాటు 19మండలాల ఎంపిడిఒలు, వైద్యాధికారులు సాయిచరణ్, రవీంద్ర, భాను ప్రతాప్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యలపై ముఖ్యకార్యదర్శితో చర్చ

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇటీవల తాను రాష్ట్రంలో పర్యటించిన సమయంలో గిరిజన ప్రాంతాల్లో తనదృష్టికి వచ్చిన సమస్యలపై ఆ శాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండేతో ఎస్సి ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు చర్చించారు. ముఖ్యంగా గిరిజన సంక్షేమ పాఠశాలలు, ఏకలవ్య, గురుకులాల్లో పనిచేస్తున్న సిఆర్‌టిలు ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగ అవకాశాల వల్ల తమను తొలగిస్తారేమోనన్న ఆందోళన వెలిబుచ్చిన సంగతి, గురుకులాల్లో ఉద్యోగోన్నతులు, రెగ్యులరైజేషన్ వినతులు, బొర్రా, అరకుల్లో పర్యాటక రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల వినతులు తదితర అంశాలపై చర్చించారు. బొర్రా పంచాయితీకి టూరిజం శాఖ నుంచి వాటా నిధులు రాకపోవడం, ప్రైవేట్ సంస్థల ద్వారా అడ్వెంచర్ పార్కుల ఏర్పాటుతో పర్యావరణనికి స్థానిక గిరిజనులకు, వారి హక్కులకు కలుగుతున్న నష్టంపై వారి ఆందోళన, అటవీహక్కుల అంశాలు చర్చకు వచ్చాయి. ప్రభుత్వం ఈ అంశాలపై సత్వరమే స్పందిస్తుందని ఆయన తెలిపారు.

సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా మార్చండి

ప్రజాశక్తి - సాలూరు

ఏజెన్సీ ప్రాంతాల్లో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను అశాలుగా మార్చి వారికిచ్చే వేతనం, ఇతర సౌకర్యాలు అమలు చేయాలని కోరుతూ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొరకు వారు వినతిపత్రం అందజేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్, శ్రామిక మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వి.ఇందిర ఆధ్వర్యాన వారు శనివారం రాజన్నదొరను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ఇస్తున్న విధంగా రూ.10వేలు వేతనం చెల్లించాలని, యూనిఫాం, మెడికల్ కిట్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. గిరిజన గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు అనేక సేవలు అందిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం వీరికి నాలుగు వేల రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారని చెప్పారు. డైరెక్టర్ కార్యాలయం నుంచి వేతనాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ నాయకులు మత్స రమణమ్మ, జి.మాలతి, ఎన్.రాజేశ్వరి, ఎం.రాణి పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎంకు వినతి



డిప్యూటీ సిఎం రాజన్నదొరకు వినతిని అందజేస్తున్న సిహెచ్‌డబ్ల్యులు

ఐటిడిఎ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలి

కొమరాడ: సమస్యల పరిష్కరించాలని కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఈనెల 19న స్థానిక ఐటిడిఎ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈమేరకు స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి అరుణ్ కుమార్‌కు, మాదలంగి, రామభద్రపురం వైద్యాధికారులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సామ్యూల్ జాన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశలుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.10వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కనువిప్పు కలిగేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



అధికార, ప్రతిపక్షాలకు ఇప్పటికైనా కనువిప్పు కలిగేనా? రాష్ట్రానికి నమ్మకద్రోహం చేసిన బిజెపికి దూరంగా ఉండేనా? అన్న చర్చ గడిచిన నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా సాగుతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇటీవల టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ వెళ్లి బిజెపి పెద్దలతో మంతనాలు జరిపిన సంగతి తెలిసిందే. ఎన్నికల్లో పొత్తు కుదుర్చుకునేందుకే బాబు ఢిల్లీ వెళ్లారనే చర్చ సర్వత్రా సాగుతోంది. చంద్రబాబు మౌనం వహించడం ద్వారా జనం విమర్శల్ని అంగీకరించారు. ఈనేపథ్యంలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన మాజీ కేంద్ర మంత్రి, సీనియర్ రాజకీయ నేత వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్ ఇటీవల టిడిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించిన విషయం విధితమే. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోవడంతోపాటు మతోన్మాద బీభత్స పాలనకు తెరలేపడం ద్వారా ఓటు బ్యాంకు సృష్టించుకోవడమే లక్ష్యంగా ఎన్‌డిఎ ప్రభుత్వం పనిచేస్తోందని, అటువంటి బిజెపితో టిడిపి చెలిమి చేయడం రాష్ట్రానికి ఏమాత్రం శ్రేయస్కరంకాదని, తాను అందువల్లే తన సభ్యత్వాన్ని రద్దుచేసుకోదలచుకున్నాని తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. దీన్నిబట్టి రాష్ట్రానికి బిజెపి ఎంత ద్రోహం చేసిందో వేరేగా చెప్పనక్కర్లేదు. దేశం, రాష్ట్రంతోపాటు ఉత్తరాంధ్ర, అందులోనూ ఉమ్మడి విజయనగరం జిల్లాకు బిజెపి పాలనలో చాలా అన్యాయమే జరిగింది. పదేళ్ల క్రితం నాటి గిరిజన వర్శిటీ హామీ కలగానే మిగిలిపోయింది. ఆరేళ్ల ఆలస్యంగా వర్శిటీని ఏర్పాటుచేసినప్పటికీ సొంత భవన సముదాన్ని సమకూర్చలేదు. తొమ్మిదేళ్ల తరువాత ... అంటే గడిచిన నాలుగు నెలల క్రితం కేంద్ర విద్యాశాఖ మంత్రి భూమి పూజచేసేందుకు వచ్చినందుకు అధికార వైసిపి నాయకులు, సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి మురిసిపోయారు తప్ప, ఇన్నాళ్లు జరిగిన ఆలస్యంపై ప్రశ్నించలేదు. పైగా కేంద్రం ప్రవేశపెట్టిన ప్రజావ్యతిరేక పథకాలన్నీ మరే రాష్ట్రంలోనూ అమలు చేయనంతగా మన ప్రభుత్వం అమలు చేసింది. దీని ఫలితమే విద్యుత్ ఛార్జీలు, ఫెట్రోల్, డీజిల్, నిత్యవసర సరుకులు ధరలు, చెత్తపన్ను వంటివి. ఇంకా ఆలోచిస్తే నూతన విద్యావిధానం పేరిట స్కూళ్లను మెర్జిచేసి లక్షలాది మంది విద్యార్థులను సర్కారు బడులకు దూరం చేసింది. మరోవైపు పాఠశ్యాంశాల్లో శాస్త్రీయతను చూపించే డార్విన్ సిద్ధాంతం సహా అనేక భౌతిక పాఠ్యాంశాలను రద్దుచేసింది. వాటి స్థానంలో ఖర్మసిద్ధాంతం, మనవాదం, మూఢనమ్మకాలు పెంచిపోషించే అంశాలను చేర్చింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎలాగూ ఇవ్వలేదు. కనీసం వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీకి కూడా ముఖం చాటేసింది. దీంతో, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో చాలా వెనుకబడిపోయాయి. ఇప్పటికీ ఏజెన్సీలో తగిన రహదారులు లేవు. బహుసా అందుకేనేమో మన్యం జిల్లాలో అక్షరాస్యతలో అట్టడుగు స్థానంలోకి వెళ్లింది. ఇప్పటికీ సర్కారు దవాఖానాలు లేక రోగులకోసం ఢోలిమోతలు తప్పడం లేదు. ఎస్.కోట మండలం, మూలబొడ్డవర పంచాయతీ చిట్టెంపాడు గిరిజన గ్రామానికి చెందిన తల్లీపిల్లలు మరణం ఇందుకు మచ్చుతునకగా చెప్పుకోవచ్చు. ఉద్యోగాల ఆశచూపి వరుసగా రెండు సార్లు గద్దెనెక్కిన బిజెపి ప్రభుత్వం మాట నిలబెట్టుకోకపోవడంతో నిరుద్యోగం తాండవిస్తోంది. కూలిపనుల కోసం విదేశాలకు పోవాల్సిన దుస్థితీ దాపురించింది. నల్లధనం వెలికి తీతపేరిట కరెన్సీ నోట్ల రద్దు వల్ల మన జిల్లా ఇప్పటికీ ఆర్థికంగా తేరుకోలేదు. ఇలా విద్య, వైద్యం వంటి కనీస అసరాలు తీర్చేందుకు కూడా సహకరించని కేంద్ర ప్రభుత్వం సందు దొరికితే కులం, మతం, ప్రాంతీయ విభేదాలు సృష్టించడం ద్వారా రాజకీయ మనుగడ సాగించేందుకు బిజెపి ప్రభుత్వం బరితెగించింది. ఈ క్రమంలో రాజ్యాంగ మూలాలు దెబ్బతింటున్నాయి. సామన్యులకు రక్షణ కొరవడింది. ఇటువంటి తరుణంలో ఇవే అంశాలను తప్పుగా ఎత్తిచూపుతూ పార్టీకి రాజీనామా చేయడం చర్చనీయాంశమే అయ్యింది. ప్రజాదృక్కోణం గల మేధావులు కిశోక్ చంద్రదేవ్ వైఖరిని సమర్థిస్తున్నారు.

రవాణా శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్



ర్యాలీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా జిల్లా రవాణా శాఖాధికారి సి మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పార్వతీపురం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ సుమారు 100 ద్విచక్ర వాహనాలతో పార్వతీపురం ఆర్‌డిఒ కార్యాలయం నుండి కొత్తవలస ఎస్‌విడి కాలేజీ వరకు ర్యాలీ చేశారు. ర్యాలీని ఉద్దేశించి రవాణా శాఖాధికారి సి మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనాన్ని నడిపే వ్యక్తి తప్పని సరిగా ఐఎస్‌ఐ మార్క్ కలిగిన హెల్మెట్ ధరించాలన్నారు. ద్విచక్ర వాహనంపై ట్రిపుల్ రైడ్ చేయరాదని, అత్యధిక వేగంతో వాహనాలు నడపరాదని, పరిమితికి మించి అధిక ప్రయాణికులతో వాహనం నడపవద్దని సూచించారు. స్కూల్ పిల్లలను తీసుకు వెళ్ళే బస్సులు, ఆటో డ్రైవర్స్ అధిక పిల్లలను వాహనంలో ఎక్కించ కూడదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సహాయ ఇంధన శకట తనిఖీ దారులు జి.సత్యనారాయణ, రమేష్ కుమార్, రవాణా శాఖ కానిస్టేబుల్, హోం గార్డ్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్ నీలామణి

అడవుల పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అడవుల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని స్థానిక ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎం. నీలామణి కోరారు. మండలంలోని మండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులతో అడవుల పరిరక్షణ అనే అంశంపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రోజురోజుకి పెరుగుతున్న కాలుష్యం కారణంగా మనిషి మనుగడ తగ్గుతూ వస్తుందన్నారు. చెట్ల ద్వారా వచ్చే ఆక్సిజన్ ప్రతి ఒక్క ప్రాణికి ప్రాణవాయువు అని పేర్కొన్నారు. అడవి ప్రాంతంలో నేల పై గల ఆకులు, ఎండిన తుప్పలు వాటంతట అవే కుళ్ళి నేలపై సారంలా ఏర్పడతాయని అన్నారు. కాల్చిన సిగరెట్స్, బీడీలు మంటలకు సహకరించే వస్తువులు అటవీ ప్రాంతంలో వేయరాదన్నారు. వ్యవసాయ వ్యర్థాలు కాల్చడం వల్ల అవి అనుసరించి ఉన్న అడవులకు వ్యాపిస్తాయి కనుక తగిన జాగ్రత్తలు వహించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పాలక దేవానంద్, అటవీ సిబ్బంది ప్రసాదరావు, కరుణాకర రావు, పోలిరాజు పాల్గొన్నారు.


24న తాడికొండలో యాత్ర

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈ నెల 24న మండలంలోని తాడికొండ గ్రామంలో శ్రీశ్రీశ్రీ అర్ధనారీశ్వరి మజ్జి గౌరీ దేవి 54వ రాత్రి జాతర మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతర సందర్భంగా మూడు రోజులపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నీటి ఎద్దడిపై ముందస్తు చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్



బావులను పరిశీలిస్తున్న కమిషనర్

స్థానిక మున్సిపల్ పరిధిలో గల 30 వార్డులకు రానున్న వేసవికాలం దృష్ట్యా నీటి ఎద్దడి లేకుండా తాగునీటి సరఫరాపై ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ పొందూరు సింహాచలం మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. పట్టణానికి నీటి సరఫరా జరిగే తోటపల్లి రిజర్వాయర్ వద్ద ఉన్న ఇన్‌ఫిల్టరేషన్ బావులను, పంపుహౌస్‌ను మున్సిపల్ డిఇ కిరణ్ కుమార్, ఎఇ ఆనంద్‌తో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ వారితో మాట్లాడుతూ పట్టణంలో పలువార్డుల్లో తాగునీటి సరఫరా పూర్తిస్థాయిలో జరగడంలేదని ఆయా వార్డు కౌన్సిలర్లు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. రానున్న వేసవి దృష్ట్యా పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా అందించేందుకు ముందస్తు చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టాలని, అదనపు మోటార్లను సిద్ధం చేసి ఉంచుకోవాలని అన్నారు. అందుకు అవసరమైన ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసి మంచి నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

గ్యాస్ స్టవ్‌ల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన మహిళలకు గ్యాస్ స్టవ్ వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని గిరిజన కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ సిబ్బంది గిరిజన గ్రామాల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత నాలుగు నెలల నుండి గిరిజన సహకార మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన 500కు పైగా ఇండియన్ గ్యాస్ కనెక్షన్లను పూర్తి ఉచితంగా గిరిజన మహిళలకు అందించారు. ఈ మేరకు వాటి వినియోగంపై సంబంధిత జిసిసి సిబ్బంది అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గ్యాస్ కనెక్షన్ మహిళలు ఎలా ఉపయోగించుకోవాలి, రెగ్యులేటర్లు ఎలా దాన్ని వినియోగించుకోవాలి అనే విషయంపై శనివారం ఎల్విన్ పేట పంచాయతీ, జాతాపు కోటపాడు కాలనీ, ఎస్సీ పాడు తదితర గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిసిసి సిబ్బంది రాజేంద్ర, లక్ష్మణరావు, శివ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రాయగడ జమ్ము పంచాయతీలో పని చేస్తున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ టి. వెంకటరావు (శ్రీకాకుళం ప్రైవేట్ ఆసుపత్రిలో) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. మృతుడు వెంకటరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ మేరకు వైద్యం కోసం ఉపాధి హామీ సిబ్బంది కొంతమేర నగదు సాయం చేసి వైద్యం అందించినప్పటికీ ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్ మృతి చెందడం పట్ల ఇంచార్జీ ఎంపిడిఒ జగదీష్ కుమార్, ఎపిఒ శివరామకృష్ణ, తోటి సిబ్బంది సంతాపం తెలిపారు.

కిమ్మి పాఠశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న పి జస్వంత్ కు శనివారం విజయవాడలో జరిగిన మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో పాఠశాల ఎడ్యుకేషన్ కమిషనర్ ఎస్ సురేష్ కుమార్ చేతుల మీదుగా రూ. 5వేలు నగదు, ప్రశంస పత్రం అందజేశారు. జస్వంత్ ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఈతెంపంటి పరీక్షల్లో ప్రతిభ కనబరిచినందుకు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు గౌరినాయుడు, ఆనందరావు, ప్రధానోపాధ్యాయులు బి అప్పలనాయుడు, సర్పంచ్ జి రామ్మోహన్ రావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డైరీని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఇన్‌ఛార్జి డిఆర్ఒ జి.కేశవ నాయుడు, పార్వతీపురం, పాలకొండ ఆర్‌డిఒలు కె.హేమలత, వివిరమణ, అసోసియేషన్ జిల్లా సెక్రటరీ మరడ సింహాచలం, తాలూకా ప్రెసిడెంట్ ఎస్. పురుషోత్తం నాయుడు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ ఫుల్...నిద్ర నిల్!

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని చిన్నగుడబ గ్రామ రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేసిన మైనింగ్ వల్ల ఈ క్వారీకి సమీపానున్న గదబవలస గ్రామ ప్రజలంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మైనింగ్‌కు అనుబంధంగా ఏర్పాటు చేసిన స్టోన్ క్రషర్ నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళల్లో అత్యధిక ధ్వని ప్రభావం వల్ల ప్రజలకు నిద్రలేమి కలగడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్వారీ వల్ల గ్రామమంతా కాలుష్య కోరల్లో చిక్కుకుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్రషర్ నుంచి వచ్చే ధుమ్మూ, ధూళి వల్ల గ్రామస్తులు అనారోగ్యానికి గురవుతున్నారు. అలాగే పంటలు కూడా పండడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కాలుష్యమైన చెరువు

గుంతలను పూడ్చాలి

క్వారీ వద్ద వంద అడుగులపైబడి అడుగులోతులో ఉన్న గుంతను పూడ్చకపోతే వ్యవసాయ భూములన్నీ బీడు భూములుగా మారే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో నీరంతా ఈ గుంతలో చేరి సాగు భూముల్లో తడి లేకుండా చేస్తుంది. ఈ విషయమై అధికారులు గుర్తించి గుంతలను పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

గ్రామాన్ని గుర్తించని అధికారులు...

ఈ మైనింగ్ కంపెనీ చిన్న గొడవ గ్రామ రెవెన్యూ పరిధిలో ఉందని అధికారులు చెప్పుకొస్తున్నారు. దీనివల్ల రెవెన్యూ గ్రామానికి ఎలాంటి ఇబ్బందుల్లేవని చెబుతున్నారు. పరిశీలనకు వచ్చిన అధికారులకు క్వారీకి ఆనుకొని ఉన్న గ్రామాన్ని గుర్తించకపోవడం అనేది బాధాకరమైన విషయమని గదబవలస గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

భూమి పోయే బువ్వ పోయే...

ఈ మైనింగ్ కంపెనీ నుంచి 2 మీటర్ల దూరంలో నా పొలం ఉంది. క్వారీ ఏర్పాటైన తర్వాత ఎకరాలకు కనీసం రెండుబస్తాల ధాన్యం కూడా రాలేదు. మైనింగ్ కంపెనీ వంద అడుగుల పైబడి లోతు తవ్వకాలు చేపట్టడం వల్ల భూమి సారాన్ని కోల్పోయి ఈ ఏడాది గడ్డి తప్ప ధాన్యం గింజ రాల్లేదు. కురిసిన వర్షం నీరంతా క్వారీ గుంతల్లో చేరి పొలాలు బీడువారి పోతున్నాయి. దీంతో భూమిపోయి బువ్వకు కరువైపోయాం.

- ధర్మారావు, గదబవలస

భూమి పోయే ... బువ్వ కరువాయే..



శబ్ధకాలుష్యాన్ని విరజిమ్ముతున్న క్వారీ ఇదే...

'ఆ అర్హత సంధ్యారాణికి లేదు'

ప్రజాశక్తి - పాచిపెంట

గిరిజనాభివృద్ధిపై మాట్లాడే అర్హత నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి సంధ్యారాణికి లేదని ఎంపిపి బడ్నాన ప్రమీల అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్లో శనివారం విలేకరులతో మాట్లాడారు. 18 ఏళ్లగా రాజన్నదొర ఎమ్మెల్యేగా కొనసాగుతూ నియోజకవర్గానికి ఏం అభివృద్ధి చేస్తారని సంధ్యారాణి మాట్లాడడం చాలా హాస్యస్పదంగా ఉందన్నారు. 18 ఏళ్లగా ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారంటే ప్రజల్లో ఎంత విశ్వాసం ఉందో అర్థం చేసుకోవాలన్నారు. నియోజకవర్గ ఇన్చార్జిగా ఉండడానికే సొంత పార్టీకి చెందిన నాయకులే సంధ్యారాణిని విశ్వసించడంలేదని, అలాంటి ఆమె రాజన్నదొరపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాజన్నదొర చేసిన అభివృద్ధి పనులు చూడాలంటే ఒకసారి పాచిపెంట మండలానికి రావాలని కోరారు. మండలంలో జరిగిన రోడ్లు, వంతెనలు, భవన నిర్మాణాలు, జగనన్న కాలనీలు, నాడు-నేడు వంటి అనేక అభివృద్ధి పనులు కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తున్నాయని చెప్పారు. అధికార పార్టీలో ఆరేళ్ల ఎమ్మెల్సీగా ఉండి కనీసం ఒక్క గిరిజన గ్రామానికైనా ఒక్క రహదారి సౌకర్యం కూడా కల్పించలేని సంధ్యారాణి గిరిజన ప్రాంతాల అభివృద్ధి గురించి మాట్లాడడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. ఒక్క పాచిపెంట మండలంలోని సుమారు రూ.100 కోట్లుతో గిరిశిఖర ప్రాంతాలకు రహదారి నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు కూడా చేశామన్నారు. శంఖారావం సభకు లోకేష్ రాజన్నదొర వేయించిన బైపాస్ రోడ్డు వెంటే రావడం జరిగిందని అంతకంటే రాజన్నదొర చేసిన అభివృద్ధికి ఉదాహరణ అన్నారు. రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి ఉపముఖ్యమంత్రి, మంత్రి పదవులు వచ్చేందుకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించిన బొత్స సత్యనారాయణ, మజ్జి చిన్న శ్రీనివాసరావు పట్ల విశ్వాసంతో ఉండి వారి సూచనలు, సలహాలు మేరకు పరిపాలన సాగించడం తప్పా అన్నారు. సంధ్యారాణి పొలిట్ బ్యూరో సభ్యురాలుగా ఉండి బొబ్బిలి రాజుల వంటి నియోజకవర్గ ఇన్చార్జిలు వద్ద చేతుల కట్టుకొని నిలబడలేదా అప్పుడు ఆమెకు స్థాయి, పదవి గుర్తు రాలేదా అన్నారు. సంధ్యారాణి ఇలాంటి చౌకుబారు విమర్శలతో గౌరవాన్ని పాడు చేసుకోవద్దన్నారు. ఇకనైనా నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తే ప్రజల హర్షిస్తారని లేకుంటే ప్రజలు సైతం తిరగబడే అవకాశం లేకపోలేదు అన్నారు.

టిడిపి చేసిన అభివృద్ధి పనులేమిటో చెప్పండి

సాలూరు: గతంలో టిడిపి ప్రభుత్వ హయామంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులేమిటో చెప్పాలని వైసిపి నాయకులు దండి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి జర్జాపు సూరిబాబు, పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు డిమాండ్ చేశారు. శనివారం వారు డిప్యూటీ సీఎం రాజన్నదొర నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకు మీరు ఎమ్మెల్సీగా చేసిన పనుల జాబితా మీకు నచ్చిన విలేకరుల చేతికి ఇవ్వాలని కోరారు. మా మంత్రి, డిప్యూటీ సీఎం రాజన్నదొర హయాంలో జరిగిన అభివృద్ధి పనుల జాబితాతో మేం సిద్ధంగా వున్నామని చెప్పారు. ఎవరేమి చేశారో మీకు నచ్చిన ప్రదేశంలో చర్చకు రావాలని కోరారు. నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం రాజన్నదొర ఏవిధమైన అభివృద్ధి చేయలేదని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్, మాజీ ఎమ్మెల్సీ సంధ్యారాణి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. జిల్లాలో సీనియర్ నాయకుల పట్ల విధేయతతో వుండడం డిప్యూటీ సీఎం రాజన్నదొరకి వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. చేసిన అభివృద్ధి పై ఎప్పుడైనా తాము చర్చకు సిద్ధమేనని చెప్పారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

కిల్కారీ యాప్‌పై శిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుబాయి, కుసిమి, మర్రిపాడు పిహెచ్‌సిల పరిధిలోని ఆశా కార్యకర్తలకు మాతా శిశు మరణాలను అరికట్టుటకు ఉపయోగపడే కిల్కారీ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ యాప్‌లో రూపొందించిన కోర్సును ప్రతి ఆశా కార్యకర్త పూర్తి చేయాలని డిఎంహెచ్ఒ జగన్నాథరావు అన్నారు. ఈ కోర్సు ద్వారా నేర్చుకున్న అంశాలపై గర్భిణీలకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణీల ఫోన్ నెంబర్లను ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో పొందుపర్చాలన్నారు. తద్వారా గర్భిణీకి ప్రతి వారం వాయిస్ రికార్డ్‌తో ఫోన్ కాల్ వస్తుందని, గర్భిణీకి అవసరమయ్యే సలహాలు, సూచనలు ఇస్తారని అన్నారు. కార్యక్రమంలో స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ రాజు, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, మోహనరావు, ఉషారాణి, యోగీశ్వరరెడ్డి, విజయలక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

దాహార్తిని తీర్చిన సర్పంచ్

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కొటికిపెంటలో వేసవి దృష్ట్యా గ్రామస్తులకు తాగునీటి సమస్య తలెత్తకుండా దాహార్తిని తీర్చేందుకు పంచాయతీ నిధుల ద్వారా చాకలి వీధిలో రూ.లక్షా70వేలతో తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. ఈ పథకాన్ని శనివారం స్థానిక సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించిన సర్పంచ్ అప్పలనాయుడుకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ రామాంజనేయులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు మార్చాల్సిందే

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలోని కొత్త వీధి సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్ మార్చాల్సిందేనని పట్టణ పౌర సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నగర పంచాయితీ కమిషనర్ సర్వేశ్వరావుతో కలిసి సమావేశమయ్యారు. కొట్టవీధి ప్రాంతంలో చెత్త వేయడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని చుట్టూ పక్క ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాడుతున్నారని తెలిపారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ 1,2,19,20 వార్డులకు ఆనుకొని ఉన్న డంపింగ్‌యార్డును అక్కడ నుంచి తరలించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూస్తున్నామని తెలిపారు. ఈ డంపింగ్ యార్డ్‌లో చెత్త వేయమని, అక్కడ ఉండే చెత్తను తరలిస్తామని, అలాగే ప్రత్యామ్నాయ మార్గాన్ని చూస్తున్నామని తెలిపారు. దీనిపై ఇప్పటికే పాలకవర్గ సభ్యులతో మాట్లాడామన్నారు. పాలకులు, 1,2,19,20 వార్డు ప్రతినిధులతో జాయింట్ సమావేశం వేసి రాత పూర్వకమైన మినిట్ కాపీ ఇస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. కమిషనర్‌ను కలిసిన వారిలో టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్, ఒకటో వార్డు కౌన్సిలర్ పడాల రాంబాబు (ప్రతినిధి) గారు, వైసిపి పట్టణ నాయకులు కోరాడ సూర్య నారాయణ (బాబు), జనసేన నాయకులు పోరెడ్డి ప్రశాంత్, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణ, టిడిపి నాయకులు నమ్మి కృష్ణ, కె.చిట్టిబాబు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

రబీకి నిరంతర విద్యుత్తు ఇవ్వండి

ప్రజాశక్తి - పాచిపెంట

రబీ సాగుకు ఆటంకం లేకుండా నిరంతరం 9గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలని రైతులు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యాన స్థానిక విద్యుత్‌శాఖ ఎఇ కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల అధ్యక్షులు మాదిరెడ్డి తిరుపతి నాయుడు, కార్యదర్శి బోను గౌరు నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పంటలకు సంబంధించి 9గంటల పాటు కరెంట్ అందించి వ్యవసాయ రంగాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చిందన్నారు. అయితే ఆరు గంటలు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంట చేతికి వచ్చే సమ యంలో నీరు లేక పంటలు పాడైపోతున్నాయని, రైతాంగం పూర్తిగా నష్టపోయి దివాళా తీసే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖ జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టర్ స్పందించి వ్యవసాయ రంగం ప్రాధాన్యతను, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బ్రేకింగ్ లేకుండా రెగ్యులర్ ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ పెంచి సాగునీరందించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఇప్పటికైనా సక్రమంగా విద్యుత్ ఇవ్వకపోతే రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్‌శాఖ ఎఇకి వినతిని అందజేశారు. దీనికి ఎఇ స్పందిస్తూ ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారం రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు బొంగు కృష్ణ, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, పోలిరాజు పాల్గొన్నారు.



వినతి పత్రాన్ని అందిస్తున్న నాయకులు, రైతులు

గ్రామీణులకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - మక్కువ

హెల్త్ వెల్నెస్ కేంద్రాల్లో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా మలేరియా అధికారి(డిఎంఒ) డాక్టర్ టి. జగన్ మోహనరావు సూచించారు. మండలంలో వెంకటభైరిపురం, కాశీపట్నం వెల్నెస్ కేంద్రాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల ఆరోగ్య తనిఖీ రికార్డులు పరిశీలించి ప్రతీ రోజు ఎంతమంది, ఏ విధమైన ఆరోగ్య సమస్యలతో వస్తున్నారు, వారికి అందజేస్తున్న చికిత్స వివరాలు పరిశీలించారు. పలు ఆరోగ్య కార్యక్రమాలకు నిర్దేశించిన రికార్డులు, రిజిస్టర్స్ తనిఖీ చేసి వివరాలు పూర్తి స్థాయిలో, పక్కగా నమోదు చేయాలని ఆదేశించారు. దీర్ఘ కాలిక రోగుల ఆరోగ్యం ఏ మేరకు కుదుటపడుతుందో పర్యవేక్షించాలన్నారు. జ్వరాలు గుర్తిస్తే వెంటనే నిర్ధారణ పరీక్షలు జరపాలన్నారు. కేంద్రంలో మందులు, వైద్య పరీక్షలు, పరికరాలు తనిఖీ చేశారు. డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ప్రజలకు అన్ని రకాల సాధారణ రోగాలకు చికిత్స అందుబాటులో ఉంచే లక్ష్యంగా ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో ప్రభుత్వం హెల్త్ వెల్నెస్ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో 105 రకాల మందులు, 14 రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. వెల్నెస్ కేంద్రాల సేవలు మరింత పటిష్టం చేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపడుతుందన్నారు.

కెజిబివి వసతి గృహం సందర్శన : అనంతరం డాక్టర్ జగన్ మోహన్‌రావు కాశీపట్నంలో కెజిబివి వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల ఆరోగ్య వివరాల రికార్డులు, సిక్ రిజిష్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల్లో ఎవరికైనా జ్వరాలు, ఇతర ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక చికిత్స నిమిత్తం అక్కడ ఉంచిన మందులను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిశీలన చేసి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విజయనాగ దుర్గ, వెల్నెస్ కేంద్రాల సిహెచ్‌ఒలు విజయకుమార్, శోభిత, భారతి, ఆశా కార్యకర్తలు తదితరులున్నారు.

వైద్య సేవలు మెరుగ్గా అందాలి :డిఐఒ

గుమ్మలక్ష్మీపురం: గిరిజన గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలందించాలని జిల్లా ఇమ్మ్యూనైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ ముటక నారాయణ వైద్యసిబ్బందికి సూచించారు. వైద్య బృందంతో కలిసి మండలంలోని చెముడుగూడను శనివారం సందర్శించారు. ముందుగా అక్కడ చిన్నారులకు, గర్భిణీలకు వైద్య సిబ్బంది వ్యాధినిరోధక టీకా వేయడాన్ని పరిశీలించారు. గ్రామంలో గర్భిణులు ఎంతమంది, ఐదేళ్లలోపు పిల్లలు ఎంతమంది ఉన్నారు, వారిలో నవజాత శిశువుల వివరాలు, వారి ఆరోగ్య స్థితి, వ్యాక్సినేషన్, గ్రామంలో జ్వరాలతో ఎవరైనా ఉన్నారా తదితర అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. అక్కడకి వచ్చిన గర్భిణీ, బాలింతలకు చిన్న పిల్లల ఆరోగ్య గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుమ్మగడబవలసలో సందర్శించి, అక్కడ రక్తం తక్కువగా ఉన్న గర్భిణులను 102 ను రప్పించి పిహెచ్‌సికి ఆయన దగ్గర ఉండి పంపారు. ఇంకా ఎవరైనా అయిన రక్త హీనత ఉన్న గర్భిణులుంటే 102ని పిలిచి వారికి పిహెచ్‌సికి పంపించాలని వైద్య సిబ్బందికి వారు సూచించారు. జ్వర లక్షణాలున్న ఉన్న వారు వైద్య సిబ్బంది నిర్ధారణ పరీక్షలు చేసి, అవసరమైన మందులు ఇవ్వాలని వారు సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు జయగౌడ్, యారయ్యమ్మ, ఎఎన్‌ఎం భాగ్యలక్ష్మి, దమయంతి, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంఒ జగన్‌మోహన్‌రావు

వాహనాల వేలం ఖరారు

పాలకొండ: స్థానిక పోలీస్ స్టేషన్‌లో పాలకొండ సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శనివారం వేలంపాట వేయగా అందులో రెండు ఆటోలకు, మూడు ద్విచక్ర వాహనాలకు పాట ఖరారైంది. పాలకొండ స్టేషన్లో నాటు సారా కేసుల్లో సీజ్ చేసిన రెండు ఆటోలకు, బైకు వేలం వేయగా, ఆటోలు రూ.24,400కు, బైకు రూ.31,500కు సొంతం చేసుకున్నారు. వీరఘట్టంలో నాటుసారా కేసులో సీజ్ చేసిన నాలుగు బైకులకు వేలం పాట వేయగా ఒక బైక్ మాత్రమే రూ.3,100కు పాట ఖరారైంది. దోనుభాయి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బైక్‌కు వేలం పాట వేయగా రూ.49వేలకు పాట ఖరారైంది. కార్యక్రమంలో డీఎస్పీ జివి కృష్ణారావు, సిఐ చంద్రమౌళి, పాలకొండ, వీరఘట్టం ఎస్‌ఐలు ప్రశాంత్ కుమార్, గోవిందరావు పాల్గొన్నారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

కురుపాం: నాటు సారాను అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలను కురుపాం పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం వేలం వేస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్. షణ్ముఖరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డి.ఎస్.పి జి.వి కృష్ణారావు ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గలవారు కురుపాం పోలీస్ స్టేషన్‌కు వచ్చి వేలం పాటలో పాల్గొని వాహనాలు దక్కించుకోవచ్చుని చెప్పారు.

పథకాల పంపిణీలో వాలంటీర్లు కీలకం

ప్రజాశక్తి - కొమరాడ

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు అందజేయడంలో వాలంటీర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారని జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో వాలంటీర్ల సేవలను గుర్తిస్తూ వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 20 గ్రామ సచివాలయాలుండగా మొదటి విడత శనివారం కొమరాడ, ఉలిపిరి, చోళ్లపదం, గుమడ సచివాలయ పరిధిలో గల వాలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్పీటీసీలు మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వాలంటీర్లకు సేవారత్న సేవా వజ్ర, సేవ మిత్ర అనే బిరుదులతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం సచివాలయాలు ద్వారా వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయడం గొప్ప విషయమన్నారు. వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకు సంక్షేమ పథకాలు అందుతున్నయన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందజేయడంలో వాలంటీర్ల కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్ధన్‌నాయుడు, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, సచివాలయ ఉద్యోగులు, వైసిపి సీనియర్ నాయకులు మరడాన సింహాచలం నాయుడు, వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని పి.ఆమిటి సచివాలయం పరిధిలో ఉన్న వాలంటీర్లకు శనివారం వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి తాడంగి దమయంతి మాట్లాడుతూ గ్రామ వాలంటీర్ల సేవలు మారుమూల గ్రామాల్లో సైతం అందడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పింఛన్లు వంటివి ప్రజలకు చేరవేయడంలో వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు బిడ్డిక బృందావతి, సచివాలయం కన్వీనర్ పూయక నీలకంఠం, కార్యదర్శి రాజేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న వాలంటీర్లు

సచివాలయం సిబ్బంది ఆర్థిక సాయం

మండలంలోని పి.ఆమిటి గ్రామ సచివాలయ సిబ్బంది ఆపదలో ఉన్న వ్యక్తికి కొంత ఆర్థిక సాయం చేసి సేవా భావం చాటుకున్నారు. తాడంగి శివకుమార్ ఇల్లు ప్రమాదవశాత్తు కాలిపోయింది. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఆయన కష్టాలను గుర్తించి సచివాలయం ఉద్యోగులు తోచిన నగదు విరాళంగా ఇచ్చి సర్పంచి దమయంతి చేతులు మీదుగా బాధితునికి అందజేశారు.

సిఆర్‌టిలకు నష్టం కలగకుండా చూడాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఒప్పంద ఉపాధ్యాయులకు (సీఆర్టీ) ఎటువంటి నష్టం లేకుండా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర, మాజీ మంత్రి పుష్పశ్రీవాణి, గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపిలు చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డిఎస్సీలో గిరిజన సంక్షేమ శాఖ పోస్టులు చూపించిన నేపథ్యంలో ఇప్పటికే ఒప్పంద ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారు తమ ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎవరికీ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే 2016లో పోస్టుల్లేవని 12మంది గిరిజన ఒప్పంద ఉపాధ్యాయులకు తొలగిస్తే తాము పోరాటం చేసి తిరిగి నియామకం జరిగేలా చేశామని వారు గుర్తు చేశారు. మళ్లీ అదే పరిస్థితి వస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఒక వైపు ఒప్పంద ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేస్తామని, మరోవైపు భిన్నమైన నిర్ణయాలు ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

సంఘాల బలోపేతానికి కృషి

వీరఘట్టం: డ్వాక్రా సంఘాల బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా ఇన్చార్జి డిఆర్‌డిఎ పీడీ వై సత్యంనాయుడు విఒఎలకు ఆదేశించారు. శనివారం స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో విఒఎలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సంఘాలకు రుణాలు అందించడంలోనూ వసూళ్లు చేయడంలోనూ ప్రత్యేక బాధ్యత తీసుకోవాలన్నారు. వారితో ఎప్పటికప్పుడు సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో మహిళ మార్ట్ పై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా సంఘాల ద్వారా సమావేశాలు ఏర్పాటు చేసి కొనుగోలుపై దృష్టి పెట్టాలన్నారు. నాణ్యమైన సరుకుతో పాటు మార్కెట్ కంటే ధర కూడా తక్కువగా ఉంటుందని వివరించాలన్నారు. ఈ సమావేశంలో డిపిఎంబి ప్రవీణ్, ఎపిఎం బి.శివుని నాయుడు, మండల మహిళా సమైక్య అధ్యక్షులు పి. సుజాత, ఎఫ్‌పిఒ వై ఆనందరావు, సీసీలు, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.